సాక్షి
పశ్చిమగోదావరి

ఆదివారం । 10 । సెప్టెంబర్ । 2023



నిత్యాన్నదానానికి విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు కలిదిండికి చెందిన కృష్ణ చైతన్య, మాధురి, దీపక్ కుటుంబం శనివారం రూ.1,00,116ను విరాళంగా అందజేశారు.



భక్తుల కిటకిట

ద్వారకాతిరుమల: చినవెంకన్న క్షేత్రం శనివారం భక్తులతో కిక్కిరిసింది. శ్రావణ మాసం, రెండో శనివారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

ఏలూరు ఆర్డీఓగా ఖాజావలీ



ఏలూరు (మెట్రో): ఏలూరు రెవెన్యూ డివిజనల్ అధికారి ఎస్‌కేఎన్ ఖాజావలీ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా ఆయన కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

న్యూస్‌రీల్

అర్హతే ప్రామాణికంగా పథకాలు



గడపగడపకు కార్యక్రమంలో బ్రోచర్ అందిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల గోపి

యలమంచిలి: అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) అన్నారు. మండలంలోని దొడ్డిపట్ల గ్రామంలో శనివారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు కార్యక్రమం నిర్వహించారు. టీటీడీ బోర్డు మెంటర్ మేకా శేషుబాబు, ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనందప్రకాష్, దెందులూరు నియోజకవర్గ పరిశీలకుడు యడ్ల తాతాజీ, మండల కన్వీనర్ పొత్తూరి బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్ట్ సక్రమమే

ఏలూరు (టూటౌన్): స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో పక్కా సాక్ష్యాధారాలు ఉన్నందువల్లే టీడీపీ అధినేత చంద్రబాబును అరెస్టు చేసి విజయవాడ ఏసీబీ కోర్టులో హాజరు పర్చారని ఏలూరు వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జిల్లా నాయకులు పితాని దుర్గాప్రసాద్, చదలవాడ వెంకటరమణ, తోట సుధీర్ శనివారం ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ధనాన్ని దోచుకోవాలనే కుట్రతోనే చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటుచేశారని పేర్కొన్నారు. చంద్రబాబు అరెస్ట్ సక్రమమే అని తెలిపారు. రాజకీయ లబ్ధి కోసమే చంద్రబాబును కుట్రపూరితంగా అరెస్టు చేశారని, ఇది నిబంధనలకు విరుద్ధమని పవన్ కళ్యాణ్, పురంధరేశ్వరి చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ఐటీ స్కామ్‌తో పాటు ఇన్నర్ రింగ్ రోడ్, ఏపీ ఫైబర్ నెట్‌లో కూడా అవకతవకలు జరిగాయన్నారు.

పాపం పండింది!

స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో పక్కా ఆధారాలతో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు అరెస్టు కాగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజల్లో ఏమాత్రం స్పందన కనిపించలేదు. చంద్రబాబు అరెస్ట్‌ను టీడీపీ శ్రేణులు కూడా లైట్‌గా తీసుకున్నాయి. మొక్కుబడి నిరసనలతో సరిపెట్టాయి. అడ్డంగా దొరికిపోయిన తర్వాత ఆందోళనలు ఏంటని ప్రజలు విసుక్కోవడం కనిపించింది. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలు, నాయకులు దీనిపై స్పందిస్తూ.. 'చంద్రబాబు పాపం పండింది' అంటూ వ్యాఖ్యానించారు.

సాక్షి ప్రతినిధి,ఏలూరు: సాక్ష్యాధారాలతో అడ్డంగా బుక్కైన తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు అరెస్టుపై ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పార్టీ నేతల్లో స్పందన కనిపించలేదు. పలుచోట్ల టీడీపీ నేతలు మొక్కుబడిగా నిరసనలు చేశారు. పార్టీ పిలుపును జిల్లాలో శ్రేణులు లైట్ తీసుకున్నాయి. పర్యావసానంగా చంద్రబాబు అరెస్టుపై జిల్లాలో టీడీపీ శ్రేణుల్లో ఆశించిన స్థాయిలో స్పందన లేకపోగా నూరు శాతం వాణిజ్య సముదాయాలు, ఆర్‌టీసీ బస్సులు, ఇతర వ్యాపార కార్యకలాపాలు కొనసాగాయి. ప్రతి నియోజకవర్గంలో టీడీపీ నేతలు నామమాత్రంగా పది నిమిషాలు కార్యక్రమాలు చేసి ఇళ్లకు పరిమితమయ్యారు.

బెడిసికొట్టిన ప్లాన్

చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ ధర్నాలు, రాస్తారోకోలు, బంద్‌లు నిర్వహించాలని టీడీపీ నాయకులు చేసిన ప్లాన్ బెడిసికొట్టింది. భీమవరంలో జరిగిన యువగళం పాదయాత్రలో దాడి కేసులో మాజీ ఎంపీ తోట సీతారామలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తో కలిపి 13 మందిపై నాన్‌బెయిల్‌బుల్ కేసులు నమోదు కావడంతో వీరు 13 మంది పరారీలో ఉన్నారు. ఇక టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు హడావుడి చేయడానికి ముందే



ఏలూరులో యథావిధిగా సాగుతున్న జనజీవనం



ఫైర్‌స్టేషన్ సెంటరులో పోలీసుల పహారా

హౌస్ అరెస్టు చేయడంతో నిరసనలు పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. మాజీ ఎంపీ మాగంటి బాబును ఏలూరు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. జంగారెడ్డిగూడెం, దెందులూరు, నూజివీడు, కైకలూరు, పోలవరం, ఉంగుటూరు, తాడేపల్లిగూడెం, నరసాపురం, భీమవరంలో పది నిమిషాల పాటు మండల స్థాయి నేతలు మొక్కుబడి నిరసనలను చేసి వెళ్లిపోయారు. ఇక ఉండి టీడీపీ ఎమ్మెల్యే మంతెన రామరాజు నిరసనలకు పూర్తిగా దూరంగా ఉన్నారు. నూజివీడు చినగాంధీ బొమ్మ సెంటరులో టీడీపీ శ్రేణులు అత్యుత్సాహం చూపారు. పాత ఇనుప సామాన్ల కొట్టులో ఉన్న తుక్కు ద్విచక్రవాహనాన్ని తీసుకువచ్చి సెంటరులో నిరసన పేరుతో తగులబెట్టే ప్రయత్నం చేయగా పోలీసులు నీళ్లు చల్లారు.

నిమ్మల డ్రామాలు : పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహనరావును పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఈ క్రమంలో రామానాయుడు బైండోవర్ నోటీసు ఇవ్వడానికి వచ్చిన పోలీసులను చూసి రెచ్చిపోయి రోడ్డుపైకి వచ్చి ఇష్టానురీతిలో కేకలు వేసి గందరగోళం చేశారు. రోడ్డుపై పడుకోవడంతో గుండెపోటు వచ్చిందంటూ హడావుడి చేశారు. వైద్యపరీక్షలు చేసిన తర్వాత అంతా బాగుందని స్వల్ప నీరసం మినహా ఏమి లేదని తేల్చడంతో పోలీసులు అరెస్టు చేసి బెయిల్‌పై విడుదల చేశారు.

ఆరిమిల్లి స్టంట్ షో: తణుకులో మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పార్టీ శ్రేణులతో కలిసి నరేంద్ర సెంటరులో రాస్తారోకోకు ప్లాన్ చేశారు. పోలీసులు ఆందోళన చేస్తున్న రాధాకృష్ణను తీసుకువెళ్లేందుకు యత్నిస్తున్న క్రమంలో రోడ్డుపై పడుకుని హడావుడిగా నినాదాలు చేశారు. కాలు బాగాలేదంటూ ఆయన ఒకటికి నాలుగుసార్లు అరిచారు. దీంతో పోలీసులు ఆగిపోయారు. మళ్లీ రాధాకృష్ణ పక్క వారిని చూసి 'ఏం లేదులే.. నినాదాలు చేయండి..' అంటూ చెప్పడం గమనించి పోలీసులు ఆయన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

పవన్‌కూ భాగస్వామ్యం ఉంది



చంద్రబాబు అవినీతిలో పవన్ కళ్యాణ్‌కు భాగ్యస్వామ్యం ఉంది. అందుకే చంద్రబాబు చేసిన తప్పును సమర్థిస్తున్నాడు. చంద్రబాబు అవినీతి గురించి ప్రశ్నించడం మాని పవన్ కళ్యాణ్ సానుభూతి తెలపడం వెనుక అనుమానాలు ఉన్నాయి. పక్కా ఆధారాలతో చంద్రబాబును అరెస్ట్ చేస్తే ఖండిస్తానని పవన్ కళ్యాణ్ చెప్పడం అవివేకం. చంద్రబాబును అరెస్ట్ చేస్తే బాధపడుతున్న పవన్ కళ్యాణ్ భీమవరంలో లోకేష్ గ్యాంగ్ దాడులు చేసి సామాన్యులను, మహిళలను గాయపరిస్తే ఎందుకు ఖండించలేదు.

– గ్రంధి శ్రీనివాస్, భీమవరం ఎమ్మెల్యే

పక్కా ఆధారాలతోనే..



పక్కా ఆధారాలతో చంద్రబాబును అరెస్ట్ చేస్తే.. రాజకీయ కక్షతో అరెస్ట్ చేశారనడం సబబు కాదు. వ్యక్తిగతంగా చంద్రబాబును ఇబ్బంది పెట్టాలనే ఆలోచన సీఎం జగన్‌కు గాని, వైఎస్సార్ సీపీ పార్టీకి గాని లేదు. చంద్రబాబు ప్రజలను రెచ్చగొట్టడం సరికాదు. చట్టం అందరికీ సమానమే. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌కు సంబంధించి మూడేళ్ల పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసిన తర్వాతే చంద్రబాబును అరెస్ట్ చేశారు. నాకు ఏ పాపం తెలియదని చంద్రబాబు అనడం విడ్డూరంగా ఉంది.

– పీవీఎల్ నర్సింహరాజు, డీసీసీబీ చైర్మన్

అవినీతిపరులకు హెచ్చరిక



చంద్రబాబు అరెస్ట్ అవినీతిపరులకు హెచ్చరిక వంటిది. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు కోట్లాది రూపాయిలు దోచుకుని ఇంతకాలం స్టేలతో బయట తిరుగుతున్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌పై సీఐడీ రంగంలోనికి దిగి పారదర్శకంగా విచారణ చేసి, నేర నిరూపణ కావడంతో అరెస్ట్ చేసింది. నిజంగా చంద్రబాబు ఉత్తముడైతే విచారణలో నిరూపించుకోవాలని మా డిమాండ్. మోసగాళ్లు, అవినీతిపరులకు ఎప్పటికైనా జైలు శిక్ష తప్పదు. – గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి), పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి

● గడపగడపన.. సంక్షేమ దీవెన



పెంటపాడు : పరిమెళ్ల గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

పక్కాగా గ్రామ కంఠం భూముల గుర్తింపు

కలెక్టర్ ప్రశాంతి



భీమవరం కలెక్టరేట్‌లో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం(ప్రకాశం చౌక్): ఆస్తిపై స్పష్టమైన యాజమాన్య హక్కులను గుర్తించేందుకు స్వమిత్వ యోజన దోహదపడుతుందని, గ్రామ కంఠంలోని భూముల గుర్తింపులో కచ్చితత్వం ఉండాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ఎంపీడీఓలు, ఈవోపీఆర్డీలు, పంచాయతీ సెక్రటరీలు, సర్వేయర్లకు స్వమిత్వ యోజన–జగనన్న శాశ్వత భూహక్కు–భూ రక్ష పథకం శిక్షణ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డితో కలిసి దిశానిర్దేశం చేశారు. గ్రామ కంఠంలోని భూములను కచ్చితత్వంతో గుర్తించాలన్నారు. కార్యక్రమంలో భాగంగా గ్రామ కంఠంలోని నివాసయోగ్యమైన ప్రాంతాలను సర్వే చేస్తామన్నారు. డ్రోన్ టెక్నాలజీతో ల్యాండ్ పార్సిల్స్ మ్యాపింగ్, అర్హులైన కుటుంబాలకు యాజమాన్య కార్డులను జారీ చేయడం వంటివి చేస్తామన్నారు. ముఖ్యంగా మూడు రకాలుగా ఉన్న కమ్యూనిటీ, ప్రభుత్వ, ప్రైవేటు, భూములను గుర్తించి రిజిస్టర్లలో నమోదు చేయాలన్నారు.

తొలివిడతలో.. జిల్లాలో తొలివిడతగా 16 మండలాల్లోని 16 గ్రామాల్లో సర్వే పూర్తిచేసినట్టు కలెక్టర్ తెలిపారు. రెండో విడతలో 9 మండలాల్లోని 14 గ్రామాల్లో చేపట్టామన్నారు. స్వమిత్వ యోజనతో గ్రామీణ ఆర్థికాభివృద్ధితో పాటు కచ్చితమైన భూ రికార్డులను అందించడం ద్వారా ఆస్తి వివాదాలను తగ్గించడానికి ఈ పథకం దోహదపడుతుందన్నారు. రీ సర్వే కార్యక్రమంలో వ్యవసాయ భూములను సర్వే చేసినట్టే గ్రామ కంఠంలోని భూములను కూడా సర్వే చేయాలన్నారు. వాస్తవంగా భూ సర్వే అనేది వందేళ్లకు ఒకసారి చేయాల్సి ఉందన్నారు. రీ సర్వే అంటే ఆక్రమణల తొలగింపు కాదని, వాస్తవ భూములను గుర్తించడమేనని స్పష్టం చేశారు. 13న నోటిఫికేషన్ జారీ అయిన తర్వాత కచ్చితంగా గ్రామసభను ఏర్పాటు చేసి అన్ని భూములకు సంబంధించిన భూముల వివరాలను చదివి వినిపించడంతోపాటు, వీడియో రికార్డింగ్ చేయాలని ఆదేశించారు. తొలుత జేసీ రామసుందర్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కార్యక్రమంపై అవగాహన కల్పించారు. జిల్లా పంచాయతీ అధికారి జీవీకే మల్లికార్జునరావు, జిల్లా సర్వే అధికారి కె.జాషువా, తొమ్మిది మండలాల ఎంపీడీఓలు, ఈఓపీఆర్డీలు, పంచాయతీ సెక్రటరీలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌తో సత్వర న్యాయం

సాక్షి, భీమవరం: భీమవరం కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 965 కేసులు పరిష్కరించినట్టు భీమవరం మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, 3వ అదనపు జిల్లా జడ్జి పి.శ్రీసత్యాదేవి చెప్పారు. రాజీమార్గం ద్వారా త్వరితగతిన న్యాయం పొందవచ్చన్నారు. సివిల్ కేసులు 32, భీమవరం టౌన్, రూరల్, వీరవాసరం, ఉండి, పాలకోడేరు, కాళ్ల, ఆకివీడు పోలీస్‌స్టేషన్లకు సంబంధించి క్రిమినల్ కేసులు 110, మనోవర్తి కేసులు10, చెక్‌బౌన్స్ కేసులు 34, బ్యాంక్ రికవరీ కేసులు 28, ఎస్‌టీసీ కేసులు 742, బీఎస్ఎన్ఎల్ కేసులు 8 రాజీ చేశామన్నారు. సుమారు రూ.2.09 కోట్లకు అవార్డులను జారీచేశామన్నారు. ఐదు బెంచ్‌లను ఏర్పాటుచేయగా సీనియర్ సివిల్ జడ్జి బి.అప్పలస్వామి, ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి ఎ.పవన్‌కుమార్, 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎ. సురేష్‌బాబు, 2వ అదనపు జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ డి.ధనరాజు, బెంచ్ సభ్యులుగా వీవీ సుబ్బారావు, బి.త్రిమూర్తులు, బి.దీన ప్రకాశమ్మ, ఎస్.నాగబాబు, సీహెచ్ జానీలక్ష్మి వ్యవహరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.వెంకటరమణరావు, కార్యదర్శి పి.రమేష్‌బాబు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా భేష్

దెందులూరు: సురక్షిత తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య పనుల అమలులో గోపన్నపాలెం పంచాయతీ తీరు భేష్ అని నోబెల్ బహుమతి గ్రహీత మైఖేల్ రాబర్ట్ క్రైమర్ (అమెరికా), లండన్ జలజీవన్ మిషన్ ప్రతినిధి మైకె అన్నారు. శనివారం గోపన్నపాలెంలోని మసీదుపాడులో తాగునీరు సరఫరా, పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. గ్రామాన్ని జలజీవన్ మిషన్ దత్తత తీసుకుందని, క్లోరినేషన్‌కు బదులు క్యాండిల్ ద్వారా తాగునీరు శుద్ధి చేస్తున్నట్టు సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి వారికి వివరించారు. గ్రామంలోని పలువురు ఇళ్లకు వెళ్లి తాగునీటి సరఫరాపై ఆరా తీయగా గ్రామస్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం గ్రామ సచివాలయంలో క్రైమెర్, మైకేలకు సర్పంచ్ నాగమల్లేశ్వరి , వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కామా కుమార్‌బాబు శాలువాతో సత్కరించారు.

9,859 కేసుల పరిష్కారం

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రెండో జడ్జి మంగాకుమారి



మాట్లాడుతున్న రెండో జిల్లా జడ్జి మంగాకుమారి

ఏలూరు (టూటౌన్): జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రెండో జడ్జి పి.మంగాకుమారి పిలుపునిచ్చారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా కోర్టులున్న అన్ని ప్రదేశాల్లో శనివారం లోక్ అదాలత్ నిర్వహించారు. శనివారం స్థానిక జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాభవన్‌లో ప్రారంభ కార్యక్రమానికి జడ్జి మంగా కుమారి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. లోక్ అదాలత్‌లో క్రిమినల్, సివిల్, వాహన ప్రమాద బీమా కేసులు పరిష్కరిస్తారన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి, పలువురు న్యాయమూర్తులు, ఏలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్బినేని విజయ్‌కుమార్, ప్రభుత్వ న్యాయవాది బీజే రెడ్డి, పీపీ కోనే సీతారాం, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

కేసుల పరిష్కారం : జాతీయ లోక్ అదాలత్‌లో రాత్రి 8 గంటల వరకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 9,859 కేసులు పరిష్కరించినట్టు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి తెలినపారు. కేసుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. 248 సివిల్ కేసులు పరిష్కరించగా వీటిలో 65 ప్రమాద బీమా కేసులను రాజీ చేయడం ద్వారా రూ.3 కోట్ల 34 లక్షల 59 వేలు పరిహారంగా చెల్లించారన్నారు. 9,462 క్రిమినల్, 149 ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించినట్టు తెలిపారు.

అసంఘటితానికి ఆసరా

- అసంఘటిత కార్మికులకు ఆర్థిక, సామాజిక భద్రత
- సచివాలయాల్లో ఉచితంగా ఈ–శ్రమ్‌లో నమోదు
- నేటి వరకు 7,12,926 మంది కార్మికుల నమోదు


పెదవేగి మండలంలో పనిచేస్తున్న ఉపాధి కూలీలు

పెదవేగి: కార్మికుల సంక్షేమం, సామాజిక భద్రతకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ–శ్రమ్ నమోదు ఇప్పుడు ప్రతి సచివాలయంలో అందుబాటులోకి వచ్చింది. అసంఘటిత రంగ కార్మికులకు ఆర్థిక, సామాజిక భద్రత కల్పించేందుకు ప్రతి సచివాలయంలో ఉచితంగా నమోదు చేస్తున్నారు. అసంఘటిత రంగ కార్మికుల సమాచారం (డేటాబేస్) సేకరించడమే ఈ–శ్రమ్ ప్రధాన లక్ష్యం. దీని ద్వారా ప్రభుత్వ పథకాలు, ఆర్థిక సాయం, నష్టపరిహారం నేరుగా కార్మికులకు అందించవచ్చు. అంతేకాక విపత్తు సమయాల్లో కార్మికుల వివరాలు క్షణాల్లో తెలుసుకోవచ్చు. ఈ–శ్రమ్ గుర్తింపు కార్డు దేశంలో ఎక్కడైనా పనిచేస్తుంది.

ఈ–శ్రమ్ కార్డు ఉంటే..

ఈ శ్రమ్ గుర్తింపు కార్డును కేంద్ర ప్రభుత్వం జారీ చేస్తుంది. ఆధార్ నంబర్‌లా దేశవ్యాప్తంగా కార్మికుడికి ఒక గుర్తింపు సంఖ్య ఉంటుంది. 12 అంకెల నంబర్‌తో గుర్తింపు కార్డు ఇస్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు అనేక పథకాలు ప్రారంభిస్తున్నప్పటికీ చాలా మంది వాటిని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. అయితే ఈ–శ్రమ్ పోర్టల్‌లో నమోదుతో కార్మికుల ప్రమేయం లేకుండా ప్రభుత్వ పథకాల ద్వారా వచ్చే ఆర్థిక సాయం నేరుగా కార్మికులు బ్యాంకు ఖాతాకు జమవుతుంది. మెరుగైన ఉపాధి అవకాశాలకు నైపుణ్యాల అభివృద్ధికి సహాయం లభిస్తుంది. అంతేకాక ప్రమాదానికి గురై మరణిస్తే రూ.2 లక్షలు బీమా సంస్థ చెల్లిస్తుంది. అంగవైకల్యం పొందితే రూ.1 లక్ష అందిస్తుంది.

7,12,926 కార్మికుల నమోదు

ఈ పథకం 2021 ఆగస్టులో ప్రారంభం కాగా, దీనిలో ఇప్పటివరకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 7,12,926 మంది కార్మికులు నమోదు చేసుకోగా, పశ్చిమగోదావరిలో 6,09271, ఏలూరు జిల్లాలో 1,03,655 మంది నమోదు చేసుకున్నారు.

అసంఘటిత కార్మికులు ఎవరంటే..

భవన నిర్మాణ కార్మికులు, వ్యవసాయ కూలీలు, ఇళ్లు, దుకాణాల్లో పనిచేసేవారు, కొరియర్ బాయ్స్, తోపుడు బండి కార్మికులు, వలస కార్మికులు, ఆశ వర్కర్‌లు, అంగనవాడీ వర్కర్లు, మత్స్య కార్మికులు, ప్లాంటేషన్ వర్కర్స్, పాల వ్యాపారులు, చిరు వ్యాపారులు, ట్యూషన్ టీచర్లు, చేతివృత్తులవారు, కార్పెంటర్లు, ప్లంబర్స్ ఇలా అనేక రకాల పనులు చేసే వారంతా అసంఘటిత కార్మికులే.

ఇవి పాటించండి

- ఈ–శ్రమ్ పథకంలో నమోదు కోసం ఎటువంటి రుసుము చెల్లించనక్కర్లేదు
- అర్హులైన వారు సమీప వార్డు సచివాలయంలో వివరాలు నమోదు చేసుకోవచ్చు.
- ఈ పథకంలో నమోదు కోసం ఆధార్ జిరాక్స్, బ్యాంకు ఖాతా నంబర్, సెల్‌ఫోన్ నంబర్ ఇవ్వాలి
- కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సాయం నేరుగా కార్మికులు, నామినీ అకౌంట్‌కు జమ అవుతుంది

ప్రతి కార్మికుడూ నమోదు చేయించుకోవాలి



ప్రభుత్వం సామాన్య ప్రజానీకానికి సాయం అందించేందుకు ఈ–శ్రమ్ ప్రవేశపెట్టింది. ప్రతి కార్మికుడు తప్పనిసరిగా దీనిలో నమోదు అయి ఉండాలి. భవిష్యత్‌లో ఈ పథకాన్ని మరింత పటిష్టం చేయనున్నారు.

– గంజి వెంకట రమణ, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్, దెందులూరు

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి



సాక్షి, భీమవరం : పెన్నాడ–వీరవాసరం రైల్వేస్టేషన్ల మధ్య శనివారం గుర్తు తెలియని వ్యక్తి ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి మృతి చెందినట్లు జీఆర్పీ ఎస్సై పీటీవీ రమణ చెప్పారు. మృతుడికి 35 సంవత్సరాలు వయస్సు ఉండవచ్చని, నీలం రంగు జీన్స్ ప్యాంటు, తెలుపు, నీలం రంగు గళ్ల కలిగిన పొడుగు చేతుల చొక్కా ధరించి ఉన్నాడన్నారు. ఎడమ చేతిపై శ్వేతశ్రీ అనే పచ్చబొట్టు ఉందని తెలిపారు. మృతుని వివరాలు తెలిసినవారు 70939 39777 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని ఎస్సై కోరారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతానికి వలస కూలీ మృతి


బిద్దేశ్వర్ దోలే మృతదేహం

కైకలూరు (మండవల్లి): చేపల చెరువుపై విద్యుత్ తీగలు తగిలి ఓ వలస కూలీ షాక్‌కు గురై మృతి చెందాడు. మండవల్లి పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మూడుతాళ్లపాడు గ్రామంలో చేపల చెరువుపై అసోం రాష్ట్రానికి చెందిన వలస కూలి బిద్దేశ్వర్ డోలే (38) శనివారం భుజంపై ఇనుపరాడ్లను చెరువు గట్టుపైకి తీసుకెళుతుండగా కాలికి విద్యుత్ వైర్లు తగలడంతో షాక్‌కు గురై ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. కైకలూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీకి మృతదేహాన్ని తరలించారు. అతని భార్య, ముగ్గురు పిల్లలు అసోంలో నివసిస్తున్నారు. మృతుని సోదరులు ఇక్కడే వలస కూలీలుగా పనిచేస్తున్నారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


భీమవరంలో రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

రాష్ట్ర ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక

సాక్షి, భీమవరం: కాకినాడ జెడ్పీ హైస్కూల్లో ఈ నెల 11, 12 తేదీల్లో నిర్వహించే రాష్ట్ర స్థాయి ఇంటర్ డిస్ట్రిక్ట్ బాలబాలికల ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు శనివారం భీమవరంలో క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. రెండు విభాగాల్లో నిర్వహించే ఈ పోటీల్లో జిల్లా నుంచి ఎం.సమీక్ష, ఎస్.శర్షిత, యు.అనీష్‌కృతిక్‌వర్మ, డి.షాహ, వి.సూర్యరామకృష్ణరాజు, బి.శషికార్తీక్, ఐ.అహాన్‌వర్మ, ఎం.ఆకాంక్ష, ఐ.హితికేష్, ఆర్.అభిరామ్, బి.అవినాష్, జీవీఎస్ ఆర్యాక్, జె.కాశీఅభినవ్, డి.వర్షితశ్రీరంగవర్మ, సీహెచ్ కార్తికేయ వర్మ, ఎ.ఐష్ణవి ఎంపికయ్యారని ఫెన్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జీఎస్‌వీ కృష్ణమోహన్ చెప్పారు.

14 నుంచి అండర్–19 జిల్లా జట్ల ఎంపికలు

పెదవేగి: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల విద్యార్థులకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి అండర్–19 జిల్లా జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తామని ఇన్‌చార్జి డీవీఈఓ చంద్రశేఖర్, ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.జయరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 6వ తేదీ వరకు ప్రాంతాలు, తేదీల వారీగా, బాలురకు, బాలికలకు నిర్వహించే ఆటలు, క్రీడల వివరాలను జయరాజు వివరించారు. తొలిరోజు 14న పెదవేగి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో బాలురకు అథ్లెటిక్స్, సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, కబడ్డీ, సెపక్‌తక్రా, 15న బాలురకు ఖోఖో, హ్యాండ్‌బాల్, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తారు. 26న ఏలూరులోని సెయింట్ థెరిస్సా జూనియర్ కళాశాలలో బాలికలకు బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్, 27న పాలసానిపల్లి గురుకుల పాఠశాలలో బాలికలకు అథ్లెటిక్స్, త్రోబాల్, టెన్నికాయిట్, సెపక్‌తక్రా పోటీలు నిర్వహిస్తారు. 29న భీమవరంలోని బ్రౌనింగ్ జూనియర్ కళాశాలలో బాలురు, బాలికలకు ఆర్చరీ, షూటింగ్, ఫెన్సింగ్, రోప్ స్కిప్పింగ్, నెట్‌బాల్, జిమ్నాస్టిక్స్ పోటీలు నిర్వహిస్తారు. 30న తణుకు ఎస్‌కేఎస్‌డీ మహిళ కళాశాలలో బాలికలకు టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్, వాలీబాల్, ఖోఖో, బాలురు, బాలికలకు చెస్, యోగా పోటీలు నిర్వహిస్తారు. అక్టోబర్ 3 జంగారెడ్డిగూడెం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో బాలికలకు సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, 4న ఏలూరు ఇండోర్ స్టేడియంలో బాలురు, బాలికలకు బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్, జూడో, కరాటే, స్కేటింగ్ పోటీలు ఉంటాయన్నారు. అదే రోజు ఏలూరు ఏఎస్సార్ స్టేడియంలో బాలురు, బాలికలకు ఫుట్‌బాల్, హాకీ, స్విమ్మింగ్ పోటీలు ఉంటాయి. అక్టోబర్ 5న ఏలూరు సీఆర్‌ఆర్ కళాశాల బాలుర క్యాంపస్‌లో బాలికలు, బాలురకు క్రికెట్ పోటీలు, అనంతరం బాలురకు టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహిస్తారు. 6న పెదవేగిలోని సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలో బాలురు, బాలికలకు రెజ్లింగ్ పోటీలు నిర్వహిస్తామని వివరించారు. ఆసక్తి, ప్రతిభ గల క్రీడాకారులు నిర్దేశించిన ప్రదేశాల్లో ఉదయం 8.30 గంటలకు హాజరుకావాలని చంద్రశేఖర్, జయరాజు సూచించారు. మరిన్ని వివరాలకు 99493 66162 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

16న బాస్కెట్ బాల్ జిల్లా జట్ల ఎంపిక

మచిలీపట్నం టౌన్: ఉమ్మడి కృష్ణా జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీన అండర్–14, అండర్–17 బాలబాలికల బాస్కెట్‌బాల్ జిల్లా జట్లను ఎంపిక చేస్తామని స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి తోట అజయ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నూజివీడులోని టీఐఎస్ సీబీఎస్ఈ స్కూల్ ఆవరణలో ఈ ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 84998 14311 సెల్ నంబరులో సంప్రదించాలని సూచించారు.

ఎస్ఈబీ దాడులు

చింతలపూడి: ఎస్ఈబీ ఆధ్వర్యంలో నాగిరెడ్డిగూడెంలో ఎక్సైజ్ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. దాడుల్లో ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు సీఐ సాయి స్వరూప్ తెలిపారు. బెల్లం వ్యాపారిపై కూడా కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

క్లుప్తంగా

కృష్ణ మందిరంలో పూజలు



కృష్ణ మందిరంలో గీతా పారాయణం చేస్తున్న మహిళలు

తాడేపల్లిగూడెం: కృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా రామచంద్రరావుపేటలోని శ్రీకృష్ణ యోగ ధ్యానమందిరంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. సుదర్శన మహామంత్రం, సుదర్శన షట్కం, సుదర్శన్ శతకం, పంచమ హాయుధ స్తోత్రం పారాయణ జరిగాయి. భక్తులు గీతా ఉపన్యాసాలు చేశారు. ఈ కార్యక్రమాలను నిర్వాహకులు పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

15న తణుకులో మెగా జాబ్‌మేళా

తణుకు టౌన్: పట్టణంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీన తణుకులోని శ్రీ చిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీ అనిల్ కుమార్ తెలిపారు. శుక్రవారం తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించే ఈ మెగా జాబ్ మేళా కార్యక్రమాన్ని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ప్రారంభిస్తారని తెలిపారు. ఈ జాబ్ మేళాలో 25 కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. ఈ జాబ్ మేళాలో కళాశాల విద్యా కమీషనర్ డాక్టర్ పోలా భాస్కర్ పాల్గొంటారని తెలిపారు.

బతికి.. సాధించాలి

- ఆత్మహత్య సమస్యలకు పరిష్కారం కాదు
- క్షణికావేశంలో నిర్ణయాలు సరికాదు
- ఆత్మహత్యల నివారణ దిశగా ప్రభుత్వం చర్యలు
- నేడు ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం

సమస్య ఏదైనా క్షణికావేశంలో నిండు ప్రాణాలు బలితీసుకుంటున్న ఘటనలు సమాజంలో క్రమంగా పెరుగుతుండటం ఆందోళన రేకెత్తిస్తోంది. పరీక్షలో తప్పారనో, ఉద్యోగం రాలేదనో, ప్రేమ విఫలం అయ్యిందనో, కుటుంబ కలహాల వల్లనో అర్థాంతరంగా జీవితాలను చిదిమేసుకుంటున్నారు. బలవన్మరణాలకు పాల్పడుతున్నవారిలో ఎక్కువగా యువత, అందులోనూ వ్యసనాలకు లోనైన వారు, మానసిక సమస్యలతో బాధపడుతున్నవారు ఉంటున్నారని వైద్య నిపుణులు చెబుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతి ఏడాది సెప్టెంబర్ 10వ తేదీన ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవంగా నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో ఆత్మహత్యల నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మానసిక సమస్యలతో బాధపడుతున్నవారికి కౌన్సెలింగ్, మెరుగైన వైద్య సేవలను అందిస్తోంది.

తణుకు అర్బన్/భీమడోలు : ఏదో ఒక కష్టం, నష్టం, ఆవేదన, ఆవేశం, ఉక్రోశం, ఆందోళన.. తీవ్ర భావోద్వేగాలకు లోనై నిరాశ నిస్పృహలకు గురై సమాజంలో ఒంటరిగా మిగిలిపోయామనో ఆత్మహత్యకు పురిగొల్పుతున్నాయి. సమస్యలను ఎదుర్కొలేని మానసిక బలహీనతే ఆ పని చేయిస్తుంది. మనోవేదనతో అర్థాంతరంగా తనువు చాలిద్దామనేలా వారిలో ఆలోచన రగిలేలా చేస్తోంది. పోటీతత్వంతో చదవలేక విద్యార్థులు.. సెల్‌ఫోన్ చూడనివ్వలేదని తల్లిదండ్రులపై అలిగి.. ప్రేమలో విఫలమై యువతీ, యువకులు.. అత్తింట వేధింపులు తట్టుకోలేక.. ఆర్థిక పరిస్థితుల కారణంగా.. మోసం చేశారనో.. వ్యసనాల బారిన పడో ఆత్మహత్యలకు ఒడిగడుతున్నారు. జీవితంలో ఎటువంటి అనుభూతులను ఆస్వాదించకుండానే నిండు జీవితాన్ని అధిక శాతం యువత ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని గణాంకాలు చెబుతున్నాయి. జీవితంలో ఓడిపోయామని, మనం ఏమి సాధించలేమనే నిరాశ నిస్పృహలతో యవ్వనంలోనే నిండు జీవితాన్ని ముగిస్తూ కుటుంబ సభ్యులకు కన్నీరుమిగిలిస్తున్నారు. ఆత్మహత్యల నివారణకు మానసిక వైద్య నిపుణులు, ప్రభుత్వాలు ఎన్నో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఆత్మహత్యల నివారణకు జుడీషియల్ విభాగం సైతం న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తూ ప్రజల్ని చైతన్యపరుస్తోంది.



తణుకులో వైద్యసిబ్బందికి ఆత్మహత్యల నివారణపై అవగాహన కల్పిస్తున్న మానసిక వైద్యనిపుణులు. (ఫైల్)

ఆత్మహత్యలు చేసుకునే వారి ఆలోచనలు ఇలా

పదే పదే ఆత్మహత్యలపై మాట్లాడుకోవడం, తనకు తానే హాని కలిగించుకునేందుకు ప్రయత్నించడం, తీవ్ర ఒత్తిడితో చికాకు పడడం, ఒంటరి జీవితాన్ని ఇష్టపడడం, నిరాశా నిస్పృహాలు, ప్రతి విషయాన్ని ప్రతికూలంగా ఆలోచించడం, నిద్ర లేమి అసంతృప్తి వ్యక్తం చేస్తుండడం, ఇలాంటి మార్పులు ఒక వ్యక్తితో కనిపిస్తే ఆత్మహత్య గురించి ఆలోచనలు చేస్తున్నట్లు భావించాలని మానసిక వైద్యులు చెబుతున్నారు. సాధారణంగా 15 నుంచి 80 సంవత్సరాల వయస్సు వరకు ప్రతి ఒక్కరూ ఏదోక సందర్భంలో ఆత్మహత్య చేసుకోవాలన్న బలహీన క్షణాలను ఎదుర్కొనే ఉంటారు. మానసిక ఒత్తిడికి గురవతున్న మహిళల్లో కూడా ఇటువంటి ఆలోచనలు ఎక్కువే. మహిళలు కన్నా పురుషులే ఎక్కువగా ఆత్మహత్యలు పాల్పడుతుండగా, వారిలో గ్రామీణ ప్రాంతాల్లో వారే ఎక్కువ.

స్నేహపూర్వక మాటలతోనే తొలి చికిత్స

ఆత్మహత్య చేసుకోవాలన్న ఆలోచించే వారిని గుర్తించిన వెంటనే వారిలో సాధ్యమైనంత త్వరగా స్నేహపూర్వకంగా మాట్లాడాలి. వారికి కుటుంబ సభ్యులు, స్నేహితులు ధైర్యం చెప్పాలి. మంచి మాటల ద్వారా అండగా ఉన్నామనే భరోసా ఇచ్చే ప్రయత్నం చేయాలి. ఓపికగా వారి సమస్యలను అడిగి తెలుసుకోవాలి. వారి చెప్పే సమస్యలు అర్థం చేసుకుని పరిష్కార మార్గాలను చూపాలి.

తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి



సమస్యలతో ఇబ్బంది పడే వారి ప్రవర్తన, సంభాషణ తీరులో ఆత్మహత్య సంకేతాలను గుర్తించవచ్చు. జీవితంలో ఏదైనా కోల్పోయినా, నష్టపోయినా కుటుంబసభ్యులు కనిపెడుతూ ఉండాలి. ముఖ్యంగా విద్యార్థి దశలో తాను సరిగా చదవలేకపోతున్నాననే భావన ఇప్పటి విద్యార్థుల్లో అధికంగా ఉంది. వీరిపట్ల తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

– డాక్టర్ ఎల్.సాయిబాలాజీ, మానసిక వైద్య నిపుణులు, తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి

పిల్లలతో ఆప్యాయంగా మెలగాలి



పోటీతత్వంతో విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి లోనై ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు చూస్తున్నాం. తల్లిదండ్రులు తమ పిల్లల చదువు విషయంలో వారిని గమనిస్తూ ఉండాలి. వారితో కొంతసేపు ఆప్యాయంగా మాట్లాడడం ద్వారా వారిలో ధైర్యం నింపే అవకాశంతో పాటు మన సమస్యను తల్లిదండ్రులకు చెప్పవచ్చనే భావన వారిలో వస్తుంది.

– డాక్టర్ దాట్ల సుందరరామరాజు, వైఎస్సార్ సీపీ వైద్యవిభాగం జిల్లా అధ్యక్షుడు

నెలకు 20 నుంచి 30 కేసులు

ఏలూరు జీజీహెచ్‌కు నిత్యం ఆత్మహత్యాయత్నం, ఆత్మహత్య కేసులు నెలలో సుమారుగా 20 నుంచి 30 వరకూ వస్తూ ఉంటాయి. వీటిలో 50శాతానికి పైగా యువత ఉంటున్నారు. ఆత్మహత్యాయత్నం కేసులు ఏడాదికి 2 వేలకు పైగా ఉంటుండగా, వీటిలో సుమారుగా 100 నుంచి 180 మంది వరకు ఆత్మహత్య కేసులు ఉంటున్నాయి. ఏలూరు జీజీహెచ్‌లోని మానసిక వైద్య విభాగం ప్రత్యేక శ్రద్ధతో ఆత్మహత్యాయత్నం కేసుల్లో బాధితులకు కౌన్సెలింగ్ ఇస్తూ భరోసా కల్పిస్తోంది. మహిళలు, పురుషులకు వేర్వేరుగా ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేసి, మత్తుపదార్థాలు, గంజాయి, మద్యం వంటివాటికి బానిసలైన వారికి కౌన్సెలింగ్, చికిత్స అందిస్తూ వారిలో మార్పుకు కృషి చేస్తున్నారు.

వరాల వెంకన్నకు విశేష పూజలు



ఈడూరులో విశేష అలంకరణలో వరాల వెంకటేశ్వరస్వామి

అత్తిలి: ఈడూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీవరాల వెంకటేశ్వర స్వామివారికి శనివారం విశేష పూజలు జరిపారు. తెల్లవారుజామున స్వామి వారికి సుప్రభాతసేవ, తోమాల సేవ నిర్వహించారు. ఉదయం అర్చనలు చేసి, ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను జరిపారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు కాలినడకన హాజరై స్వామివారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. హాజరైన భక్తులకు దాతల సహకారంతో అన్నదానం చేశారు.

సీఎం సహాయనిధి పేదప్రజలకు వరం



బాధిత కుటుంబానికి చెక్కును అందజేస్తున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్ : సీఎం సహాయనిధి పేద ప్రజలకు వరం లాంటిదని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. పట్టణంలో పడమర విప్పర్రు గ్రామంలో సంభవించిన అగ్నిప్రమాదంలో వికలాంగురాలు భలే ప్రభావతి కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి వచ్చిన రూ.2లక్షల చెక్కును ప్రభావతి కుటుంబ సభ్యులకు ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ చేతుల మీదుగా శనివారం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పేరు చెప్పగానే మొట్ట మొదటిగా గుర్తొచ్చేది స్వర్గీయ డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి పేరేనని అన్నారు. వైసీపీ ప్రభుత్వం పగ్గాలు చేపట్టాకా వైద్యానికి పెద్ద పీట వేసిందన్నారు. ఈ సందర్భంగా ప్రభావతి కుటుంబ సభ్యులు మంత్రి కొట్టు, ముఖ్యమంత్రి జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్టీసీ ఆదాయం పెంపునకు సమష్టి కృషి అవసరం



గూడెంలో సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్టీసీ డిపోమేనేజర్ యేలూరి సత్యనారాయణమూర్తి

తాడేపల్లిగూడెం: ఆర్టీసీ ఆదాయం పెంపునకు సిబ్బంది సమిష్టి కృషి అవసరమని తాడేపల్లిగూడెం ఆర్టీసీ డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణమూర్తి అన్నారు. శనివారం ఆర్టీసీ డిపో గ్యారెజ్ వద్ద గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ బస్సు నడపడానికి కిలో మీటరుకు 51 రూపాయలు ఖర్చు అవుతుందన్నారు. ప్రమాదాల నివారణకు డ్రైవర్లు, కండక్టర్లు అప్రమత్తతో వ్యవహరించాలన్నారు. క్రమశిక్షణతో విధులకు హాజరు కావాలన్నారు. ఈపోస్ మిషన్ ద్వారా నగదు రహిత లావాదేవీలు ప్రోత్సహించాలన్నారు. డిపోను అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంటు మేనేజర్ సుధారాణి, అసోసియేషన్ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పథకాలకు అర్హతే ప్రామాణికం

- ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- చంద్రబాబు విచ్చలవిడి దోపిడి వాస్తవం
- యానాపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం



పరిమెళ్ల గ్రామంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: అర్హులందరికీ నూరుశాతం సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ఆశీర్వదించాలని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. శనివారం పరిమెళ్ల గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతీ కుటుంబానికి ప్రత్యేక లబ్ధి చేకూర్చాలన్నదే సీఎం వైఎస్ జగనన్న ప్రత్యేక ధ్యేయమన్నారు. గత ప్రభుత్వ కాలంలో టీడీపీ అధినేత చంద్రబాబు భారీ కుంబకోణంకు పాల్పడటం, దీనిపై ఆయనను అరెస్టు చేస్తే పలువురు ఖండించడం అవివేకమన్నారు. రెండు ఎకరాలు నుంచి రాజకీయాలలోకి వచ్చిన చంద్రబాబు నేడు వేల కోట్లు దోపిడీ చేసి సిగ్గులేకుండా ప్రవర్తిస్తున్నారన్నారు. మరో పక్క అమరావతి పేరున భారీ కుంభకోణం జరిగిందన్నారు. చంద్రబాబు అరెస్టు వెనుక ప్రభుత్వ తొందరపాటు, ప్రతీకారం, కక్ష్య వంటివి లేవన్నారు. యువగళం పేరుతో లోకేశ్‌లు ప్రజలను ఓట్లు వేసే యంత్రాలు చూస్తున్నారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర చేసిన తరుణంలో ఒక్క గొడవ కూడా లేకుండా పాదయాత్ర చేస్తే నేడు లోకేశ్ యాత్రలో ఆ పార్టీ కార్యకర్తలు, యువగళం సభ్యులు రక్తపాతాలు సృష్టిస్తున్నారన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనిస్తూనే ఉన్నారన్నారు. 2019 ఎన్నికలలో ఘోరంగా ఓడించినా ఈ సారి ఎన్నికలలో గెలుపుకోసం చంద్రబాబు ప్రయత్నాలు, కుయుక్తులు గమనిస్తున్నారన్నారు. లోకేశ్ పాదయాత్రలో ఒక్కరు కూడా తమ సమస్యలు చెప్పుకోవడం లేదన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు సత్యనారాయణను గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యువనేత కొట్టు విశాల్, సర్పంచ్ గొర్రెల కోటేశ్వరరావు, పార్టీ నాయకులు ఇందుకూరి నాగరాజు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపదరావు కృష్ణారావు, అడ్వకేట్ హరిదాసు రవీంద్ర, రావిపాడు గ్రామ నాయకులు ములగాల బాబ్జి, పలు గ్రామాల పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

తాడేపల్లిగూడె అర్బన్: వైద్య, విద్యారంగాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత నిచ్చి పేదలకు అందించేందుకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తుందని ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. కడకట్లలో నూతనంగా నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్ భవనాన్ని శనివారం మంత్రి కొట్టు ప్రారంభించారు. రూ. 20లక్షలతో 8 బెడ్ల హెల్త్ సెంటర్‌ను స్థానికులు వినియోగించుకోవాలని చెప్పారు. జిల్లా వైద్యాధికారి డి మహేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ డా.అనపర్తి శామ్యూల్, కర్రి భాస్కరరావు, కొలుకులూరి ధర్మరాజు, చెన్నా జనార్ధనరావు, కోడే అప్పారావు, నీలం నాగభూషణం, డాక్టర్ అమృత, డాక్టర్ సుగుణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ఆవరణలో మంత్రి కొట్టు మొక్కలు నాటారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 1,077 కేసుల పరిష్కారం



తణుకు కోర్టులో కేసులు పరిష్కరిస్తున్న న్యాయమూర్తులు



తాడేపల్లిగూడెం లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్‌బాబు

తణుకు అర్బన్: మండల న్యాయసేవా సంస్థ ఆధ్వర్యంలో తణుకు కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో న్యాయమూర్తులు పెండింగ్‌లో ఉన్న 1,077 కేసులు పరిష్కరించారు. ఏలూరు ఒకటవ అదనపు జిల్లా జడ్జి జి.రామగోపాల్ ఆధ్వర్యంలో తణుకు కోర్టులో 3 బెంచ్‌లుగా విభజించి కేసులు పరిష్కరించారు. ఒకటవ బెంచ్‌లో సీనియర్ సివిల్ జడ్జి కె.కృష్ణ సత్యలత, 2వ బెంచ్‌లో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.సాయిరామ్, 3వ బెంచ్‌లో ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి పీవీఎస్ రంజిత్‌కుమార్‌ల నేతృత్వంలో నిర్వహించిన కేసుల పరిష్కారంలో బెంచ్ అడ్వకేట్ మెంబర్లుగా ఎం.సుబ్బయ్య, ఎస్.లాజరు, కె.దుర్గాభవాని వ్యవహరించారు. రూ. 1,92,18,316 కోట్లు విలువైన సివిల్ 30, క్రిమినల్ 1019, ప్రీలిటిగేషన్ 25, వివాహ సంబంధ కేసులు 3 పరిష్కరించారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో న్యాయవాదులు, పోలీసు అధికారులు, కక్షిదారులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో 940 కేసుల పరిష్కారం

తాడేపల్లిగూడెం: స్థానిక కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో 940 కేసులు పరిష్కారమయ్యాయి. పెండింగ్ కేసులు 132, బెంచ్‌కోర్టు కేసులు 782, బీఎస్ఎన్ఎల్ , బ్యాంకు కేసులు 26 పరిష్కరించారు. 132 కేసుల్లో క్రిమినల్ కేసులు 88, ఎంసీ కేసులు 06,ఎన్ఐ కేసులు 02, సివిల్ కేసులు 25ఇతర కేసులు 11 ఉన్నాయి. లోక్‌అదాలత్‌ను వినియోగించుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి ప్రకాష్‌బాబు కోరారు. ఈ కార్యక్రమంలో అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.సూర్యకిరణ్‌శ్రీ,, జూనియర్ సివిల్ జడ్జి ఇ.అన్నామణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.అప్పిరెడ్డి, అడ్వకేట్ సీహెచ్.ఇజ్రాయెల్ రాజు పాల్గొన్నారు.

ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా ఆనాల

అత్తిలి: ఛాంబర్ ఆఫ్ కామర్స్ అత్తిలి నూతన అధ్యక్షుడిగా ఆనాల ఆదినారాయణరావు శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారుల అభ్యున్నతికి కృషి చేస్తానని, సమాజానికి సంస్థ ద్వారా సేవలందిస్తామని చెప్పారు. కరోనా సమయంలో షాపులు తెరుచుకునేందుకు కార్యదర్శిగా ఆనాడు ఆదినారాయణ అధికారులతో సంప్రదింపులు జరిపి సఫలీకృతులయ్యారని పూర్వపు అధ్యక్షుడు శింగంశెట్టి సత్యనారాయణ అన్నారు. కామర్స్ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. పలువురు పూల మాలలతో ఆదినారాయణను సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామప్రముఖులు, వ్యాపారులు పాల్గొన్నారు.

మొల్ల జయంతిని అధికారికంగా నిర్వహించాలి

తాడేపల్లిగూడెం అర్బన్ : శాలివాహన, కుమ్మర కులానికి చెందిన మొల్ల రామాయణ కవయిత్రిగా పేరుగాంచిందని మొల్ల జయంతిని అధికారికంగా నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ కుమ్మరి శాలివాహన సంఘ సభ్యులు ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణకు వినతిపత్రాన్ని శనివారం అందచేశారు. మార్చి 13న మొల్ల జయంతిని, మార్చి 22వతేదీన విక్రమాదిత్యుడి జయంతులను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించుకొనేందుకు అనుమతులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొలుకులూరి ధర్మరాజు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించ చాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి
ఫ్యామిలీ
తాడేపల్లిగూడెం
ఆదివారం ॥ 10-9-2023

వైరల్




గ్రీన్ సిగ్నల్

పట్టణాల్లోని చిన్న అపార్ట్‌మెంట్‌వాసుల నోటి నుంచి తరచుగా వినిపించే మాట 'మొక్కలు అంటే మాకు చాలా ఇష్టం. కాని స్థలం ఎక్కడిది?'

'స్థలం పెద్దగా అక్కర్లేదు. పెంచాలనే సంకల్పం ఉంటే చాలు' అంటుంది బిహార్‌కు చెందిన కమల్‌సింగ్.

ఉద్యోగ నిమిత్తం బెంగళూరులో ఉంటున్న కమల్‌సింగ్ తన చిన్న అపార్ట్‌మెంట్ బాల్కనీలో రకరకాల మొక్కలు పెంచుతుంది.

'వంటగది వ్యర్థాలతో కంపోస్ట్‌ను ఎలా తయారు చేయాలి?' అనే విషయం నుంచి ఏ మొక్కలను ఎలా పెంచాలి? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి వరకు... ఎన్నో విషయాలను సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేస్తోంది. ఆమె ఇన్‌స్టాగ్రామ్ పేజీ 'అర్బన్ హోమ్ వైబ్స్'కు ఎంతోమంది ఫాలోవర్స్ ఉన్నారు.

'స్టార్ట్ వేర్ యూ ఆర్ విత్ వాటెవర్ యూ హ్యావ్' అంటున్న కమల్‌సింగ్ స్ఫూర్తితో ఎంతో మంది పట్టణ వాసులు తమ బాల్కనీలో మొక్కల పెంపకానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చి 'మేము సైతం' అంటున్నారు.

ఇదిగో సారూ... నా మేక టికెటు



గ్రామీణ ప్రాంతాల్లో పెంపుడు జంతువులను కుటుంబసభ్యులుగా చూసుకుంటారు. పేర్లు పెట్టి ప్రేమగా పిలుచుకుంటారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఒక మహిళ మేకను పెంచుకుంటుంది. ఒకరోజు ఆమె వేరే ఊరికి పోవాల్సి వచ్చింది. మేకను ఇంట్లో ఒంటరిగా విడిచిపెట్టడం ఇష్టం లేక తనతో పాటు తీసుకెళ్లింది. విశేషం ఏమిటంటే మేకకు కూడా ట్రెన్ టికెట్ తీసుకుంది. ఐఏఎస్ అధికారి అవినాష్ శరణ్ ట్విట్టర్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో క్లిప్ వైరల్ అయింది.

'తన మేకకు కూడా టికెట్ తీసుకున్న విషయాన్ని టీటీయితో ఎంత గర్వంగా చెబుతుందో చూడండి' అని రాశారు అవినాష్.

ఇక వీడియో క్లిప్ విషయానికి వస్తే... టికెట్ చూపించమని ఆమెను టీటీయి అడుగుతాడు. 'ఇదిగో' అంటూ చూపిస్తుంది.

'నీ సంగతి సరే, మరి మేకకు టికెట్ తీసుకున్నావా?' అని సరదాగా అడుగుతాడు టీటీయి.

'అమ్మో...తీసుకోకుండా ఎలా ఉంటాను. ఇదిగో టిక్కెట్టు' అని చూపిస్తుంది.

'నేను తరచుగా రైల్లో ప్రయాణిస్తుంటాను. టికెట్ లేకుండా ట్రెన్‌లో ప్రయాణించి టీటీయికి దొరికి పోయేవారిని చాలామందిని చూస్తుంటాను. వారిని గుర్తు తెచ్చుకున్నప్పుడు ఈమె చాలా గొప్పగా అనిపిస్తుంది' అని ఒక యూజర్ స్పందించాడు.


మలాలాతో మహ్నూర్

బహుముఖ ప్రజ్ఞాశాలి

పదహారు సంవత్సరాల బ్రిటీష్–పాకిస్థానీ మహ్నూర్ ఛీమ లండన్‌లోని జనరల్ సర్టిఫికేట్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (జీసీఎస్ఈ) లెవెల్‌లో 34 సబ్జెక్‌లలో టాప్ గ్రేడ్ సాధించి రికార్డ్ సృష్టించింది. గణిత శాస్త్రం, ఖగోళశాస్త్రంలాంటి శాస్త్రాలు, ఫ్రెంచ్, లాటిన్... మొదలైన భాషలలో అద్భుతమైన ప్రతిభ చూపుతుంది మహ్నూర్. ఆమె ఎంచుకున్న 34 సబ్జెక్టలలో ఫిజిక్స్, కెమిస్ట్రీ, లిటరేచర్, ఫిల్మ్ స్టూడియోస్, సైకాలజీ... మొదలైన సబ్జెక్ట్‌లు ఉన్నాయి.

'ఇది మహ్నూర్‌కు మాత్రమే పరిమితమైన విజయం కాదు. ఈతరంలో ఎంతోమందికి స్ఫూర్తినిచ్చే విజయం' అని ట్వీట్ చేశారు పాక్ మాజీ ప్రధాని షెహబాజ్ షరీఫ్.

'వైద్యురాలిగా పదిమందికి సేవ చేయాలి' అనేది తన జీవిత ఆశయంగా చెబుతుంది మహ్నూర్.

కాలం కలిసి వస్తే డంప్‌యార్డ్ కూడా నందనవనం అవుతుంది!



కాలం కలిసే వస్తే... కంపు కొట్టే డంపు యార్డ్ కూడా కనుల విందు చేసే పార్క్ అవుతుంది. రాజస్థాన్‌లోని రాజ్‌గఢ్‌లో ఒక డంప్ యార్డ్ ఉండేది. దుర్వాసన వల్ల ఆ చుట్టుపక్కల నుంచి నడిచి వెళ్లాలంటే జనాలు జడుసుకునేవారు. అలాంటి చోటుకు ఇప్పుడు జనాలు వెదుక్కుంటు వస్తున్నారు. దీనికి కారణం ఈ డంప్‌యార్డ్‌ను మున్సిపాలిటీ సిబ్బంది అందమైన పార్క్‌గా తయారుచేయడమే.

వాటర్ ఫౌంటెన్‌లు, పచ్చటి గడ్డితో ఈ పార్క్ కనువిందు చేస్తోంది.

ఇండియన్ ఫారెస్ట్ ఆఫీసర్ సవిత దావియా ఈ క్లిప్‌ను ట్విట్టర్‌లో షేర్ చేశారు.

'ఎన్నో పట్టణాలలో ఎన్నో డంప్‌యార్డ్‌లు భయపెడుతున్నాయి. అవి కూడా ఇలాగే నందనవనంలా మారితే ఎంత బాగుంటుంది' అంటూ ఒక ఎక్స్ యూజర్ స్పందించాడు.

కథక్ నుంచి తీన్మార్ వరకు



బెల్జియన్ కంటెంట్ క్రియేటర్ ఈడీ పీపుల్ వివిధ ప్రాంతాలలో లోకల్స్‌తో కలిసి చేసే డ్యాన్స్ వీడియోలు ప్రపంచ వ్యాప్తంగా ఫేమ్ అయ్యాయి. ఏదైనా ప్రాంతానికి వెళ్లిన పీపుల్ స్థానికులను 'మీకు ఇష్టమైన డ్యాన్స్ ఏమిటి?' అని అడగడమే కాదు 'నాకు నేర్పించగలరా?' అని రిక్వెస్ట్ చేసి ఓపిగ్గా నేర్చుకుంటాడు.

అలా ప్రపంచవ్యాప్తంగా ఎన్నో ప్రాంతాలకు చెందిన డ్యాన్స్‌లను నేర్చుకుంటూ, స్థానికులతో పోటీ పడి డ్యాన్స్ చేస్తుంటాడు. ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుంటాయి.

తాజాగా మన దేశానికి సంబంధించి వివిధ ప్రాంతాలకు చెందిన డ్యాన్స్‌లు చేసి 'వారేవా' అనిపించుకున్నాడు.

'మీ డ్యాన్స్ చూస్తుంటే భారతీయ పౌరసత్వం ఇవ్వాలనిపిస్తుంది'

'మా దేశంలోని కొన్ని అద్భుతమై డ్యాన్స్‌లను మిస్ అయ్యారు. వాటిని కూడా చేస్తే బాగుంటుంది' అంటూ వివిధ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో ఈడీ పీపుల్ షేర్ చేసిన డ్యాన్స్ వీడియోలపై నెటిజనులు స్పందించారు.



అటు చూస్తే జవాన్ ఇటు చూస్తే ఆఫీస్...



అటు చూస్తే బాదం హల్వా ఇటు చూస్తే సేమ్యా ఇడ్లీ... అని శ్రీశ్రీ అన్నట్టుగా ఆ బెంగుళూరు ఐ.టి ఉద్యోగికి కూడా సంకటం వచ్చింది. ఒకవైపు జవాన్ రిలీజ్. మరోవైపు సాఫ్ట్‌వేర్ డ్యూటీ. చివరకు అతను రెండూ చేశాడు. వైరల్ అయ్యాడు.

బెంగళూరులోనే ఇటువంటివి జరుగుతుంటాయి. మొన్నా మధ్య ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ర్యాపిడో బైక్ వెనుక కూచుని ఆఫీస్‌కు వెళుతూ ట్రాఫిక్‌లో చిక్కుకుపోతే బైక్ మీదే ల్యాప్‌టాప్ తెరిచి లాగిన్ అయ్యి డ్యూటీ మొదలెట్టేశాడు. భారీ ట్రాఫిక్ వల్ల క్యాబుల్లో ఎక్కగానే ల్యాప్‌టాప్‌లు తెరిచే వాళ్లు అక్కడ ఎక్కువే. ఇప్పుడు ఒక ఉద్యోగి ఏకంగా సినిమా హాల్లోనే ల్యాప్‌టాప్ తెరిచాడు. ఏం చేస్తాడు మరి? షారూక్ ఖాన్ ఫ్యాన్. ఫస్ట్ డే ఫస్ట్ షో. సరిగ్గా ఆ టైమ్‌కే లాగిన్ అవ్వాలి. అందుకని థియేటర్‌లో ల్యాప్‌టాప్‌లో వేళ్లు టిక్కుటక్కుమంటుంటే కళ్లు సినిమాకు అంకితం అయ్యాయి. వెనుక కూచున్న ఒక వ్యక్తి ఇది ఫొటో తీసి ఇన్‌స్టాలో పెడితే లక్షల కొద్దీ వ్యూస్ వచ్చాయి. 'బెంగళూరులో ఇక పని చేయకుండా వదిలేసిన చోటు ఏదీ లేదు' అని కామెంట్లు చేస్తూ ఏడవ లేక నవ్వుతున్నారు.

హెల్త్



చాలారకాల వైరల్ జ్వరాల్లాగే డెంగీ కూడా తనంతట తానే తగ్గిపోయే (సెల్ఫ్ లిమిటింగ్) వ్యాధి. అయితే కొంత మందిలో మాత్రం ప్లేట్‌లెట్లు ప్రమాద స్థాయి కంటే కిందికి పడిపోతాయి. అది మినహా చాలావరకు డెంగీ నుంచి దాదాపుగా అందరూ కోలుకుంటారు. పైగా ఇది వైరల్ జ్వరం కావడంతో కేవలం లక్షణాలకు మాత్రమే చికిత్స చేస్తూ... ప్లేట్‌లెట్ కౌంట్‌ను జాగ్రత్తగా గమనిస్తూ ఉండాలి. ఇటీవల పెద్దసంఖ్యలో ఈ కేసులు వస్తున్న నేపథ్యంలో డెంగీపై అవగాహన కోసం ఈ కథనం.

డెంగీ నివారణ ఇలా...!



డెంగీలో రకాలు

డెంగీ రకాలను ఈ కింది విధంగా పేర్కొనవచ్చు. అవి... ఏ హెచ్చరికలూ లేకుండా వచ్చే డెంగీ (**డెంగీ విదవుట్ వార్నింగ్ సైన్స్**) ; కొన్ని హెచ్చరికలతో వచ్చే డెంగీ (**డెంగీ విత్ వార్నింగ్ సైన్స్**) ; తీవ్రమైన డెంగీ (**సివియర్ డెంగీ**)

లక్షణాలు

హెచ్చరికలు లేకుండా అకస్మాత్తుగా వచ్చే డెంగీ : డెంగీ ఎండెమిక్ ప్రాంతాల్లో... అంటే డెంగీ ఎక్కువగా వస్తున్న ప్రాంతంలో ఇది కనిపిస్తుంటుంది. వీళ్లలో జ్వరం, వికారం/వాంతులు, ఒళ్లు నొప్పులు, ఒంటి మీద ర్యాష్ వంటి లక్షణాలు కనిపిస్తాయి.

కొన్ని హెచ్చరికలతో కనిపించే డెంగీ : పైన చెప్పిన లక్షణాలతో పాటు పొట్ట నొప్పి, ఊపిరితిత్తుల చుట్టూ ఉండే ప్లూరా అనే పొరలో లేదా పొట్టలో నీరు చేరడం. కొందరిలో పొట్ట లోపలి పొరల్లో రక్తస్రావం అవుతుండటం, బాధితులు అస్థిమితంగా ఉండటం, రక్తపరీక్ష చేయించినప్పుడు ఎర్ర రక్త కణాలకూ, మొత్తం రక్తం పరిమాణానికి ఉన్న నిష్పత్తి కౌంట్ పెరగడంతో పాటు ప్లేట్‌లెట్స్ సంఖ్య పడిపోతుంది.

తీవ్రమైన డెంగీ (సివియర్ డెంగీ) కేసుల్లో : అంతర్గత అవయవాల్లో రక్తస్రావం కారణంగా బాధితుడు తీవ్రమైన షాక్‌కు గురవుతాడు. ఊపిరితిత్తుల్లో నీరు చేరి శ్వాసప్రక్రియకు అంతరాయం ఏర్పడుతుంది. తీవ్ర రక్తస్రావంతో బాధితుడు స్పృహకోల్పోవచ్చు లేదా పాక్షిక స్పృహలో ఉండవచ్చు. మల్టిపుల్ ఆర్గాన్ ఫెయిల్యూర్‌తో కీలకమైన అవయవాలు పనిచేయకుండా పోవచ్చు.

నిర్ధారణ పరీక్షలు :

● సీబీపీ ప్రతి 24 గంటలకు ఒకసారి చేయాలి. ● నిర్ధారణ కోసం డెంగీ ఎన్ఎస్1 యాంటీజెన్ పరీక్ష అవసరం కావచ్చు.

● డెంగీ ఐజీఎమ్ అనే పరీక్ష కూడా చేయాలి. కొన్ని అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో వ్యాధి నిర్ధారణ రిపోర్టులు వచ్చేందుకు పట్టే సమయం కూడా ఎక్కువే కాబట్టి డాక్టర్లు అవి వచ్చే వరకు ఆగకుండా... లక్షణాలను బట్టి చికిత్స అందించడం ప్రారంభిస్తారు.

● పై పరీక్షలతో పాటు ఇప్పుడు ఐపీఎఫ్ (ఇమ్మెచ్యూర్ ప్లేట్‌లెట్ ఫ్రాక్షన్) అనే అత్యాధునిక పరీక్ష అందుబాటులో ఉంది. ఇది ప్లేట్‌లెట్లను ఎప్పుడు, ఎంత పరిమాణంలో ఎక్కించాలో తెలుసుకోవడంతో పాటు మరెన్నో అంశాలు తెలుసుకోడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది.

డెంగీలో మరింత ప్రమాదకరమైన కొన్ని లక్షణాలివి...

● ప్లేట్ లెట్స్ తక్కువ కావడంతో అంతర్గత అవయవాలలోకి రక్తస్రావం అయ్యే ప్రమాదంతో పాటు ఒంట్లోకి నీరు చేరడం, సివియర్ డీహైడ్రేషన్‌కు గురికావడం జరగవచ్చు. ● కొందరిలో హీమోగ్లోబిన్ కాన్సంట్రేషన్ పెరుగుతుంది. హెమటోక్రిట్ పెరుగుతుంది. దీనివల్ల రక్తం గడ్డకట్టదు. రక్తపోటు పడిపోతుంది. లివర్ ఎన్‌లార్జ్ అయి, అది దెబ్బతినే ప్రమాదముంటుంది. గుండెస్పందనలు నిమిషానికి 60 కంటే తక్కువకు కూడా పడిపోవచ్చు. ఇలా గుండె స్పందనలు తగ్గినప్పుడు బాధితుల్ని ఇంటెన్సివ్ కేర్‌లో ఉంచాల్సి వస్తుంది. బ్లీడింగ్, ఫిట్స్ వల్ల మెదడు దెబ్బతినే ప్రమాదమూ ఏర్పడవచ్చు. వ్యాధినిరోధక వ్యవస్థ (ఇమ్యూన్ సిస్టమ్) పూర్తిగా దెబ్బతినడానికీ అవకాశముంది.

టీకా ఉందిగానీ...

ప్రస్తుతం డెంగీకి టీకా (వ్యాక్సిన్) అందుబాటులో ఉన్నప్పటికీ ఇది అందరూ తీసుకునే పరిస్థితి ప్రస్తుతానికి లేదు. గతంలో ఓసారి డెంగీకి గురైన వారికి మాత్రమే టీకా ఇవ్వాలి. ఎందుకంటే రెండోసారి వచ్చే డెంగీ రావడం రావడమే చాలా ప్రమాదకరంగా ఉండి ప్రాణాపాయమూ కల్పించవచ్చు. కాబట్టి ఆ పరిస్థితిని నివారించేందుకు ఒకసారి డెంగీ వచ్చినవారికి మాత్రమే టీకా ఇస్తారు.

నివారణ ఇలా...

అన్ని వ్యాధుల్లోలాగే డెంగీలోనూ చికిత్స కంటే నివారణ ఎంతో మేలు. డెంగీని కలిగించే టైగర్ దోమ పగటిపూటే కుడుతుంది. దీని సంతానోత్పత్తి మంచి నీటిలోనే. ఈ ప్రక్రియకు పదిరోజుల వ్యవధి పడుతుంది. కాబట్టి వారంలోని ఏదో ఒక రోజు ఇంటిలోని నీటిని పూర్తిగా ఖాళీ చేసి డ్రై డే గా పాటిస్తే, దీని జీవితచక్రానికి విఘాతం కలిగి ప్రత్యుత్పత్తికి అంతరాయం ఏర్పడుతుంది.

● ఇళ్ల మూలలూ, చీకటి, చల్లటి ప్రదేశాలే టైగర్ దోమల ఆవాసం. ఇల్లంతా వెలుతురు, సూర్యరశ్మి ధారాళంగా వచ్చేలా చూసుకోవడంతో పాటు, దోమలు రాకుండా తలుపులకు, కిటికీలకు మెష్ అమర్చుకుంటే...ఒక్క డెంగీ దోమలే కాకుండా...మలేరియా, ఇతర వ్యాధులకు గురి చేసే దోమల్నీ నివారించినట్లు అవుతుంది.

● టైగర్ దోమ పెద్దగా ఎత్తుకు ఎగరలేదు. అందువల్ల కాళ్లు పూర్తిగా కప్పి ఉంచే దుస్తులతో, ఫుల్‌స్లీవ్‌తో చాలావరకు రక్షణ కలుగుతుంది. ● నిల్వ నీటిలోనే దోమ గుడ్లు పెడ్తుంది కాబట్టి కొబ్బరి చిప్పలు, డ్రమ్ములు, బ్యారెల్స్, టైర్లు, కూలర్లు, పూలకుండీల కింద పెట్టే ప్లేట్లు మొదలైన వాటిల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. అలాగే వాడని డ్రమ్ముల్ని బోర్లించి ఉంచాలి.

● దోమలను తరిమివేసేందుకు మస్కిటో రిపెలెంట్స్ వాడవచ్చు.

డెంగీ వస్తే ఆందోళన చెందాల్సిన అవసరం ఉండదు. కొందరిలో మినహాయించి అది అందరిలోనూ ప్రమాదకరం కాదు. కాకపోతే గర్భిణులు, చిన్నారులు, పెద్దవయసు వారికి డెంగీ సోకినప్పుడు అది తగ్గేవరకు జాగ్రత్తగా ఉండాల్సి ఉంటుంది.

చికిత్స...

డెంగీ అన్నది వైరస్ కారణంగా వచ్చేది కాబట్టి దీనికి నిర్దిష్టంగా మందులేమీ ఉండవు. అందువల్ల లక్షణాలకు మాత్రమే చికిత్స (సింప్టమాటిక్ ట్రీట్‌మెంట్) ఇస్తారు. అంటే... అవసరమైనప్పుడు రక్తనాళం ద్వారా ఐవీ ఫ్లూయిడ్స్ ఎక్కించడం, అవసరాన్ని బట్టి రక్తాన్ని, ప్లేట్‌లెట్స్‌ను, ప్లాస్మా ఎఫ్ఎఫ్‌పి (ఫ్రెష్ ఫ్రోజెన్ ప్లాస్మా) ఇవ్వాల్సి ఉంటుంది. ఒకవేళ ప్లేట్‌లెట్స్ కౌంట్ 20 వేల నుంచి 15 వేలు లేదా అంతకంటే తక్కువకు పడిపోతేనే ప్లేట్‌లెట్స్ ఎక్కించాలి.


డా॥ రవీంద్ర కుమార్
కన్సల్టెంట్ జనరల్ ఫిజీషియన్ అండ్ డయాబెటాలజిస్ట్

పిన్‌వార్మ్ / థ్రెడ్ వార్మ్ ఇన్ఫెక్షన్ అంటే...?



కొందరు చిన్నారుల్లోని ప్రైవేట్ ప్రాంతాల్లో సన్నటి దారాల్లాంటి క్రిములు కనిపిస్తుంటాయి. మూత్ర ద్వారం నుంచి వస్తున్నట్లు కనిపించే ఇవి నిజానికి మల ద్వారం నుంచి వస్తుంటాయి. అవయవ నిర్మాణపరంగా (అనటామికల్‌గా) మూత్ర విసర్జన ప్రాంతం (యురెథ్రా)... మల ద్వారానికి దగ్గరగా ఉండటంవల్ల ఇవి మూత్ర ద్వారం నుంచి వస్తున్నట్లు అనిపిస్తుంటాయి. సన్నటి దారాల్లాంటి ఆకృతిని బట్టి వాటిని థ్రెడ్‌వార్మ్స్ లేదా పిన్‌వార్మ్స్ అంటారు. ఈ ఇన్ఫెక్షన్‌ను 'ఎంటిరోబియాసిస్' అని కూడా చెబుతారు.

యుక్తవయసుకు వచ్చిన (అడల్ట్) పిన్ వార్మ్స్ పెద్ద పేగుల్లో నివాసముంటాయి. ప్రతి అడల్ట్ జీవి 10,000 గుడ్లు పెడుతుంది. రాత్రివేళల్లో ఆడ పిన్‌వార్మ్ పెద్దపేగు (కోలన్) నుంచి మలద్వారం (రెక్టమ్) ద్వారా బయటకు వచ్చి పిరుదుల ప్రాంతంలో గుడ్లను వదిలేస్తుంది. ఆ గుడ్లు పిరుదుల మీద, మలద్వారం పరిసరాల్ని అంటిపెట్టుకుని ఉంటాయి. కొన్ని గుడ్లు గాల్లోకి కూడా వ్యాపిస్తాయి. వాటి నుంచి బయటకు వచ్చిన లార్వాలు బయటకు పిరుదులు, మలద్వారం, మూత్రద్వారం దగ్గర తచ్చాడుతుంటాయి. దురద కారణంగా పిల్లలు అక్కడ గీరుకున్నప్పుడు అవి గోళ్లలోకి చేరుతాయి. అవే చేతుల్ని నోట్లో పెట్టుకున్నప్పుడు అవి కడుపులోంచి మళ్లీ పెద్ద పేగుల్లోకి చేరి... ఇలా జీవిత చక్రాన్ని కొనసాగిస్తుంటాయి. వాటి లైఫ్ సైకిల్ పూర్తి కావడానికి 4–6 వారాలు పడుతుంది.

వ్యాప్తి ఇలా...

పిల్లలు ఆడుకునే బొమ్మలు, బెడ్ షీట్స్, తువాళ్లు, లోదుస్తులు, టాయిలెట్ సీట్స్ ద్వారా తేలిగ్గా ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తాయి. మరీ చిన్నపిల్లల్లో వాడిన డయపర్స్‌ను పెద్దలు ముట్టుకున్న తర్వాత వేరే పిల్లలను పట్టుకున్నప్పుడు కూడా వ్యాప్తి చెందే అవకాశాలుంటాయి. అయితే ఈ పిన్‌వార్మ్ ఇన్ఫెక్షన్ పెంపుడు జంతువుల (పెట్స్) ద్వారా ఇతరులకు వ్యాపించదు.

నివారణ చర్యలివి...

● పిల్లలకు ప్రతిరోజూ రెండుపూటలా స్నానం చేయించాలి. ● పిల్లలు తరచూ చేతులు శుభ్రంగా కడుక్కునేలా తల్లిదండ్రులు అలవాటు చేయాలి. ముఖ్యంగా మలవిసర్జన తర్వాతా, మట్టిలో ఆడిన తర్వాత పిల్లలు శుభ్రంగా చేతులు కడుక్కునేలా చూడాలి. ● పిల్లల గోళ్లు ఎక్కువగా పెరగకుండా వాటిని ఎప్పటికప్పుడు కత్తిరిస్తుండాలి. ● పిల్లలు తమ గోళ్లు కొరక్కుండా చూడాలి. గోళ్లు కొరికే అలవాటు ఉంటే మాన్పించాలి. ● ఇంట్లో ఎవరికైనా పిన్‌వార్మ్ ఇన్ఫెస్టేషన్ ఉంటే వాళ్లతో పాటు మిగతావాళ్లూ చికిత్స తీసుకోవాలి. లేకపోతే ఇది తరచూ తిరగబెడుతుండే అవకాశాలు ఎక్కువ.

చికిత్స... మెబెండజోల్, ఆల్బెండజోల్, పెరెంటల్ పాల్మొయేట్ అనే మందుల్ని తగిన కోర్సులుగా ఇవ్వడం ద్వారా దీన్ని పూర్తిగా నయం చేయవచ్చు.

పిల్లల్లో పొరబోయిందా? గొంతులో ఏదైనా ఇరుక్కుందా?

పిల్లలు తినే సమయంలో వారి గొంతులో ఏదైనా ఇరుక్కున్నపుడు పొర పోయిందని పెద్దలు అంటుంటారు. తిన్న ఆహారం కిందికి కదలడం కోసం తలపై తడుతుంటారు. కానీ గొంతులో ఇరుక్కున్న ఆహారంగానీ లేదా నాణెంలాంటి వస్తువు గానీ ఊపిరితిత్తుల్లోకి వెళ్లే వాయునాళంలోకి పోతే చాలా ప్రమాదం. ఇలా ఆహారం ఇరుక్కున్నా లేదా ఏదైనా వస్తువు గొంతులో ఇరుక్కున్నా హాస్పిటల్‌కు వెళ్లేలోపు ఈ కింద పేర్కొన్న సూచనలు పాటించాలి.

● పిల్లల నోరు బాగా తెరిపించి, నాలుక బాగా చాపేలా చేసి, గొంతులోకి వేళ్లుపోనిచ్చి చేతికి ఏదైనా తగులుతుందేమో చూడాలి. తగిలితే వెంటనే బయటకు తీసేయాలి. ● పిల్లాడి వెనక పెద్దలెవరైనా నిల్చుని, వారి రెండు చేతుల్నీ పొట్టచుట్టూ బిగించి, అకస్మాత్తుగా చేతుల్తో పట్టుబిగుస్తున్నట్లుగా కదిలించాలి. ఇది క్రమపద్ధతిలో (రిథమాటిక్‌గా) చేస్తుండాలి. దాంతో పొట్ట దగ్గర ఒత్తిడి పెరిగి, గొంతులో ఇరుక్కున్నది బయటకు రావచ్చు. దీన్ని హీమ్‌లిచ్ మెనోవర్ అంటారు.



● ఇదే గనక చాలా చిన్నపిల్లల్లో / పసిపాపల్లో చేయాల్సి వస్తే... పెద్దలు కుర్చీలో కూర్చుని, చిన్నారులు తలకిందులుగా ఉండేలా, వాళ్లను తమ కాళ్లపైన బోర్లా పడుకోబెట్టాలి. ఇలా పడుకోబెట్టాక, చిన్నారుల వీపుపై అకస్మాత్తుగా ఒత్తిడి కలిగేలా నొక్కాలి. ఇది ఎలా జరగాలంటే... చిన్నారుల నడుము నుంచి వారి రెండు భుజాల మధ్య ప్రాంతంలో మృదువుగా ఒత్తిడి కలిగేలా కదిలిస్తుండాలి. ఇది కూడా క్రమపద్ధతిలో (రిథమాటిక్‌గా) చేయాలి. ఒకవైపు పొట్ట మీద పెద్దల కాళ్ల ఒత్తిడీ, మరోవైపు వీపు మీద చేతుల ఒత్తిడి కారణంగా గొంతులో అడ్డు పడ్డ పదార్థం బయటకు వచ్చే అవకాశం ఉంది. ● ప్రథమ చికిత్సగా ఇవి చేస్తూ... వీలైనంత త్వరగా పిల్లల్ని హాస్పిటల్‌కు తరలించాలి. ఈ ప్రక్రియలతో గొంతులో ఇరుక్కున్నవి బయటకు వస్తే సరి. లేదంటే హాస్పిటల్‌లో అవసరాన్ని బట్టి ఎండోస్కోప్ వాడి, ఇరుక్కున్న పదార్థాన్ని డాక్టర్లు బయటకు తీస్తారు.